# లేటు వయసులో చాటువలపు

రామచంద్రం

కోడలికి వొంట్లో బాగులేదని క్రితం రోజు వుత్తరమొస్తే ఆవిడేమో పొద్దున్నే వూరికెళ్లింది. ఆవిడుండగా ఎప్పుడూ ఆలస్యం చెయ్యని పనిమనిషి, ఎనిమిది దాటి అరగంటయినా యింతవరకూ ఏతెంచలేదు. పత్ని లేని పతి పనిమనిషికి కూడా పరమలోకువే కాబోలనుకుంటూ, యింట్లో వొక్కడికీ ఏం తోచక వీధిలోకి బయలుదేరాడు విశ్వనాథం. పనిమనిషి విధినిర్వహణ గావించకపోతే తోమిన గిన్నెలుండవు. అంచేత వంటుండదు. అంచేత హోటలు భోజనం గతవుతుంది. బాబోయ్, హోటలు!

ఆడబోయిన తీర్థం అడుగులోనే ఎదురైనట్లు వీథి మొదటే కనిపించింది పారిజాతం.

"బొట్టెట్టి పిలవాలా ఏం? అంట్ల బొచ్చెలు నీ కోసం ఆవురావురుమని ఎదురుచూస్తున్నాయి" అన్నాడాయన ఆమె ఆలస్యానికి తన వ్యంగ్యంతో చురకేస్తూ.

"మీరు బొట్టూ, కాటుకా పెట్టేస్తారేమో అన్న బయంతోనే కాబోలు, అమ్మగారు తానొచ్చీ వరకూ నన్ను పన్లోకి రావొద్దన్నారు. ఇంటి ముందూ, యీదిలో మాత్రం కలాపి జల్లీ ముగ్గేసీ పొమ్మన్నారు బయటినుంచలాగే" అని నవ్వుతోంది పనిమనిషి పారిజాతం.

"ఆఁ!" ఊహించని విషయం విన్నట్లాయన తెల్లమొహం వేశాడు. పనిమనిషిని రావొద్దందా ఆవిడ?

"మీర్రమ్మంటే వొచ్చేత్తాను. కానీ ఆ తరవాత సంగతి తమరే చూసుకోవాల. రావొద్దన్నా వొచ్చానని నన్నూ, ఆవిడొద్దన్నా మీర్రమ్మన్నారని మిమ్మల్నీ అమ్మగారుతికి పెడితే నా పూచీ లేదు." నవ్వుతూనే, ఏం చెయ్యమంటారో మీరే చెప్పండి తేల్చుకుని అన్నట్లు చూడసాగింది. ఆయనకి పచ్చివెలక్కాయ గొంతుకడ్డం పడినట్లయింది.

రావొద్దంటే పెళ్లానికి భయపడిన ట్లంగీకరించినట్లవుతుంది. రమ్మంటే ఆవిడొచ్చాక పరిణామాలెలా వుంటాయో? ముందు పారిజాతం, వెనుక వర్ధనమ్మ పరువుకే పరీక్ష! ఏం చెయ్యాలా అని ఒక్క క్షణం ఆలోచించి "సర్లే, నేను కాఫీ తాగడానికెళ్తున్నాను" అని వేగంగా ముందుకి కదిలిపోయాడు. కర్ర విరగకుండా, పాము చావకుండా అంటారే అలాగ పారిజాతాన్ని రమ్మనీ అనక, వొద్దనీ అనక, పరిస్థితి నుంచి తనను తాను రక్షించుకున్నాడప్పటికి.

నిజంగా అవసరం లేకపోయినా అనృతదోషం అంటకుండా హోటలుకెళ్లి కాఫీ చెప్పాడు. ఆ కాఫీ మహత్యం కాబోలు, ఆయన బుర్ర పాదరసంలా పని చేస్తూ మెదడులోకి తారాజువ్వల్లా ఆలోచనలు దూసుకురాసాగాయి. పరిస్థితిని కూలంకషంగా విశ్లేషించసాగాడు.


వర్ధనమ్మ పనిమనిషినెందుకు రావొద్దంది? ఇంట్లో తనూ, అదే ఏకాంతంలో వుంటారు, తను దాంతో శృంగారం నెరిపేస్తాడని ఆవిడ అనుమానించిందన్నమాట! తన వయసేమో యాభయ్యారు. ప్రభుత్వపరిగణనలో తను వృద్ధుడుగానే జమ. లేటు వయసులో చాటువలపు! ఇది తనకు అభినందనా? అభిశంసనా? నిప్పు లేందే పొగా, నిజం కాస్తయినా లేనిదే అనుమానమూ రావు కదా! అంటే... తనలో యింకా ఏ మూలో ఏ కొంతో రసికత వుండేవుందన్నమాట! అంటే, పరోక్షంగా యీ అనుమానం తనకు గర్వకారణమూ, అభినందనా కూడా. అయినా వర్ధని తననిలా అనుమానించడం అవమానమూ, అన్యాయమూ, అక్రమమూ, అధర్మమూనూ! అందులోనూ పనిమనిషితో! వ్రతం చెడ్డా ఫలం దక్కాలన్నట్లు అనుమానించినా అందంగానూ, హుందాగానూ, గర్వకారణంగానూ వుండాలి. అయినావర్ధని అనుమానం మరీ దారుణం!

తన వయసు యాభయ్యారు. వర్ధనమ్మతో ముప్పయ్యేళ్ల కాపరం. కారణాలేమయినా తను వేరే ఎవ్వరితోనూ... సాహసించలేకపోయాడు. అంచేత చచ్చినట్లు బుద్ధిగానూ, పవిత్రంగానూ చప్పటి బతుకే బతికాడింతవరకూ. ఆవిడ-ఆవిడే కావచ్చు. అనుమానం ఆడదాని జన్మహక్కే కావచ్చు. మగాడైనంత మాత్రాన, మొగుడైనంత మాత్రాన మంచీచెడూ చూడకుండా అనుమానించడమేనా? మగాడెంత ముసిలాడయినా కీచకుడేనా ఏమిటి? తన శీలాన్ని శంకించడానికీ, అవకాశమొస్తే చాలు తను కాలు జారతాడనుకోవడానికీ ఆవిడకున్న ఆధారాలేమిటి? పిరికివాడిని మించిన మంచి వాడుండడన్న ఆర్యోక్తికి తార్కాణం తను. బయటపడకపోయినా పక్కనెవరూ లేకుండా ఒక్కడే భారీకాయపు భార్య ముందు నిలుచోడానికే తనకు నిజంగా భయం! మనసులో హడిలి చస్తూంటాడావిడంటే. పేరుకు విశ్వనాథుడైనా నిజానికి వర్ధనమ్మ ఒక్కతెకే నాథుడు. కారణాలేవైనా తను భార్య పట్ల విశ్వాసజంతువు. శీలవంతుడు. మంచి మొగుడుగానే మిగిలినవాడు. ఇంత మంచివాడి మీదనా ఆవిడ యిలాటి అభాండం వేస్తుంది? రానీ అడిగేస్తా! కడిగేస్తా! అయినా ఆడాళ్ల అమాయకత్వమూ, వెర్రీ కాని మగాడు చెడడానికి నిశ్చయించుకుంటే ఆపగలరా? తన దగ్గర డబ్బుంది. ఊళ్లో వెలయాళ్లున్నారు. వాళ్ల దగ్గరికి పోలేడూ తలచుకుంటే?

ఇంటికొచ్చేసరికి అతని ముందు రెండు కఠినప్రశ్నలూ, ఓ విషమసంధీ ఎదురయ్యాయి. అంట్లు తోముకుని వంట చేసుకోడమా? హోటల్లోని జైలు కూడు తిని బలవడమా? నిర్ణయం చాలా కష్టమయింది.

♦♦♦

మూడో రోజు సాయంత్రం యిల్లాలు దిగింది. "అంతా బాగానే వున్నారు" అని చెప్పేసి, యింటినొక కొలిక్కి తెచ్చి వంట చేసి, భోజనాల కార్యక్రమానంతరం తొమ్మిదికి పడకగదిలోకొచ్చి చాప పరుచుకుంది. బెడ్ లైట్ వెలగక గదంతా చీకటిగా వుండటమూ తన మంచికే అనుకున్నాడాయన. మూడు రోజుల కష్టాలతోనూ, చేదు అనుభవాలతోనూ ఆవిడగారి వైఖరిని ఖండించి, తన తీవ్రఅసమ్మతిని



తెలియజేయాలనే కృతనిశ్చయంతో వున్నాడాయన. అందుకు తగిన మనోదార్ఢ్యాన్ని పోగు చేసుకుని

వున్నాడు. భార్య లేనప్పుడల్లా భర్తకు సుఖపడే గీత లేకపోతే యింకెందుకూ అతని బతుకు? తన మంచం మీంచి మెల్లగా అన్నాడు "ఈ మూడ్రోజులూ నేనెంత యిబ్బంది పడ్డానో తెలుసా?"

"ఎందుకు తెలియదూ? నేనంటే మీకెంత ప్రేమ మరి!" ఆమె కంఠంలో గడుసుతనం.

"ప్రేమా కాదు, గీమా కాదు!"

"మరేమిటయితే?" ఆశ్చర్యపోతున్నట్లు చాప మీదే లేచి కూర్చుంది.

"నువ్వొచ్చేవరకూ పనిమనిషిని రావొద్దన్నావటగా?" చీకటి వల్ల వచ్చిన ధైర్యంతో నిలదీస్తున్నట్లూ, నిష్ఠురమేస్తున్నట్లూ అడిగాడు తెగించి.

"ఊఁ..." ఆ మూలుగులో కొంటెతనం.

"అదేమో రాలేదు. నేనేమో అంట్ల గిన్నెలు తోముకోలేక చచ్చాను చేతులు మండి. అయినా తుంటిని కొడితే పళ్లు రాలాయని నువ్వూరికెళ్తే దాన్నెందుకే రావొద్దనడం? నేనుండి చెప్తానుగా..."

"అందుకే!" ఆమె పైకనలేదు.

ఆమె మౌనానికి వొళ్లు మండి కాబోలు మళ్లీ ఆయనే అన్నాడు. "అంటే... పనిమనిషీ, నేనూ వుంటే నేను దానితో కాలు జారేస్తానని నీ అనుమానం. అంతే కదూ?"

అప్పటికీ ఆవిడేమీ అనలేదు. ఇంకా ఎంత వరకూ వొస్తాడో చూద్దామన్నట్లు వూరుకుంది చిరునవ్వుతో.

చీకటిలో ఆమే, చిరునవ్వూ కనపడని విశ్వనాథం "నీది చాలా అన్యాయమైన అనుమానం. దానికి ధర్మమూ లేదు, ఆధారమూ లేదు. నా వయసేభయ్యూరు. మన కాపరంలో యిప్పటికి మనింటికి అందగత్తెలు, అనాకారులు, యువతులు, వయసు మీరినవారు, మాటకారులు, మితభాషులు ఎందరో, ఎన్నో రకాల మనుషులు వొచ్చారు, వెళ్లారు. వాళ్లలో ఏ ఒక్కరితోనైనా ఒక్కసారైనా శృంగారించిన



నేరచరిత్రుందా నాకు? లేదే! ఇలాటి మంచినన్ను అనవసరంగా అనుమానించి, అవమానించి, వంట గిన్నెలు తోమేటువంటి అవస్థలకు మూడు రోజులపాటు గురి చేసిన నిన్ను, వర్ధనీ! దేముడే కాదు, నేను కూడా క్షమించజాలనుగాక క్షమించజాలను!" అనేశాడు ఆవేశంగా. తను బట్టీ పెట్టుకున్న వుపన్యాసాన్ని జయప్రదంగా విడుదల చేయగలిగినందుకు అతని ప్రాణానికి హాయిగా వుంది. గుండె మీంచి కొండను దింపుకున్నట్లుగా తెరిపిగా ఊపిరి పీల్చుకున్నాడు.'అమ్మయ్య!'అని కూడా మనసులో అనుకున్నాడు.

ఆవిడ చాప మీంచి లేచి ఆయన మంచం మీదికొచ్చి, పక్కన కూర్చుని ఆయన చేతిని తన చేతిలోకి తీసుకుని జాలిగా నిమురుతూ"ఇందుకే మీరమాయకులనిపిస్తుంది నాకు. ఇన్నేళ్లు కాపరం చేసినా మీరు నన్నర్థం చేసుకోలేకపోయారు. మిమ్మల్నీ అర్థం చేసుకోలేకపోయారు. నేనేం చేసినా మీ సుఖమూ, మంచీ కోరే చేస్తాను." ఒకసారాగి " మీకేభయ్యేళ్లని మీరే చెప్పినా పై వాళ్లు నమ్మరు. బొజ్జ లేదు. పచ్చని నిమ్మపండు రంగు. చురుకుగా, చలాకీగా, బంగారు శలాకలా వుంటారు. నన్ను... మీరు నా తమ్ముడా అని అడిగిన వాళ్లున్నారంటే నమ్మగలరా? స్ఫురద్రూపానికి తోడు చమత్కార సంభాషణాచాతుర్యమాయె! అంచేత ఎందరాడాళ్ల కళ్లో మీ మీదే! కూరల్దే చూడండి, నేనెంత అరిచి గీపెట్టి బేరమాడినా పైసా తగ్గించదు. అదే మీరెళ్తే రేటు తగ్గిస్తుంది, తూకం పెంచుతుంది. మీ ముఖవిశేషమది. మీ తప్పేం లేదు. అదుపులో వుండవలసిన ఆడదే చొంగ కారిస్తే మగాడేం మడిగా వుండగలడు? పారిజాతం మిమ్మల్ని దొంగ చూపులు చూడటం నేనెన్నోసార్లు చూశాను. ఎంతాశో దానికి! నా మొగుడి సత్తువ నాకు తెలియదా అని మీ మంచితనం నాకు తెలుసు. శీలం, పవిత్రత లాంటి సుగుణాలన్నీ మీ సొత్తు. అవంటే మీకు ప్రాణం. అయితే, ముసిలాయనా, ఋషి అయిన విశ్వామిత్రుణ్ణి మేనక చెడగొట్టగలగలేదూ? మీకు చెడటం యిష్టముండదు. కాని పారిజాతం సామాన్యురాలా? మిమ్మల్ని ఒక్కర్నీ చేసి ఎలాగో ముగ్గులోకి దింపేసి, తన ముచ్చట తీర్చేసుకుని యింత వరకూ అగ్నిహోత్రమంత పవిత్రంగా వున్న మిమ్మల్ని జీవితాంతమూ విచారించవలసివచ్చేలా మైల పరుస్తుందేమో అని నా భయం! రెండు చేతుల్లోనూ ఏ చెయ్యి మరో దాని దగ్గరికొస్తే మాత్రం చప్పట్లేగా! అందులోనూ'అందగాని చూడ. అవకాశమును చూడ, బొమ్మకైన పుట్టు రిమ్మతెగులు' అని వేమనమ్మ-ఆడవేమన శతకం. దాని బులబాటం తీర్చని మగాణ్ని అరిచీ, గోల చేసీ అపవాదు వేసీ వీధిన పడెయ్యదూ ఆడది? అందుకనే... మీ యిష్టానికి వ్యతిరేకంగా జరగకూడదనే... ఎందుకేనా మంచిదని... ముందు చూపుతోనే... మీ మేలు కోరే దాన్ని రావొద్దన్నాను. మీలాటి... అందంగా వుండే వయసు కనిపించని భర్తనూ, అతని పవిత్రతనూ కాపాడుకుందుకు నాలాటి భార్య ఎన్ని తిప్పలైనా పడాలి మరీ! పోన్లెండి. మీకు పారిజాతమంటే ముద్దని ఒక్కమాటనండి మీ నోటితో. రేపే దాన్ని బతిమాలుకుని మీ పక్కలో..."

"ఛీ! నేనలాంటి వాణ్ని కాను...!" అంత కంటే ఏమనగలడతను? ఆమె మాటల్లో ఏదబద్ధమో, ఏది నిజమో-అయోమయంగా వుంది. ఏది ఏమైనా గడుసు భార్య అనుమానించినా అందమే, ఆ అనుమానాన్ని విప్పి వివరించినా అందమే! అనుకుంటూ ఆమెను వుత్సాహంగా దగ్గరికి తీసుకుంటుంటే...

ఆ చమత్కారి అటు తిరిగి నవ్వుకుంటోంది!♦

# శాంటాక్లాస్ ఎముకలు

క్రిస్టమస్ తాత లేదా శాంటాక్లాస్ ఊహాతీతమైన మనిషే అయినా, రోమన్ కాథలిక్ అయిన సెయింట్ నికొలస్ అనే అతను ఆ పాత్రకి పునాది.




తపాలా బిళ్లల కథలు

ఆయన ఇప్పటి టర్కీలోని పటాచ అనే ప్రాంతంలో క్రీ.శ.271లో పుట్టాడు. అప్పట్లో రోమన్ పరిపాలనలో ఉన్న టర్కీగురించి న్యూ టెస్ట్‌మెంట్‌లోకూడా రాశారు. మెడిటరేనియన్ ఓడ రేవు అయిన పటారాకి సెయింట్ పాల్ వచ్చి క్రిస్టియన్ మతాన్ని బోధించాడు.

సెయింట్ నికొలస్ తల్లితండ్రులు ధనవంతులు. వాళ్లు కొడుక్కి ఆస్తిని ఇచ్చి మరణించారు. అయితే, దాన్నతను పేద వాళ్లకి సేవచేయడానికే వినియోగించాడు. అతని అనేకమిత్రులు అప్పటికే క్రిస్టియన్ మతంలో చేరారు. అప్పుడప్పుడే క్రిస్టియన్ మతం ఆసియాలో ప్రాచుర్యంలోకి వస్తోంది. అయితే, రోమన్ చక్రవర్తి డయోసెలెటియన్‌కి క్రిస్టియానిటీ అంటే పడేది కాదు. అతనితర్వాతి చక్రవర్తి కాన్‌స్టాన్‌టైన్ చర్చిలకి చట్టపరంగా అనుమతి నిచ్చాడు.

పటారానించి జెరూసలెంకి నికొలస్ మతపరమైన యాత్ర చేశాడు. హోలీ సిటీని సందర్శించాక నికొలస్ తిరిగి పటారా వెళ్లక మైరా(ఇప్పటి డెమ్రి) ఓడరేవు గల పట్టణంలో సెటిల్ అయ్యాడు.

మైరాలో బిషప్ అయి, చక్రవర్తిసభలో మతపరమైన సలహాదారుడుగా మారాడు. సెయింట్ నికొలస్‌కి పిల్లలంటే ప్రేమ. వాళ్ల ఆనందంకోసం ఎన్నో దయగల పనులు చేసేవాడు. ప్రతి క్రిస్టమస్‌కి వాళ్లకి అనేక బహుమతులు ఇచ్చేవాడు.

సెయింట్ నికొలస్ క్రీ.శ. 342లో మరణించాక, మైరాలో సమాధి చేశారు. ఆయన పోయాక ఆ లోపం తీనికి ఎవరో ఒకరు సెయింట్ నికొలస్‌లా నటిస్తూ పిల్లలకి బహుమతులు ఇవ్వసాగారు. డచ్‌వాళ్లు ఈ పాత్రకి సింటర్ క్లాస్ అనే పేరు పెట్టారు. క్రమంగా అది శాంటాక్లాస్‌గా మారింది. డచ్‌వాళ్లే శాంటాక్లాస్ ఎర్ర దుస్తులని రూపొందించారు. ఇందుకు కారణం మనిషి ఎవరైనా, ఏటా వచ్చేది ఒకరేనని పిల్లలు అనుకోవాలని గడ్డం, మీసాలు, టోపి, ఎర్రటి దుస్తులను అలవాటు చేశారు. ఈనాటికీ శాంటాక్లాజ్ నిజంగా ఉన్నాడని నమ్మే పిల్లలు ఉండడానికి కారణం కొన్నిశతాబ్దులుగా శాంటాక్లాజ్ ప్రతి తరానికి పరిచయం అవడమే.

సెయింట్ నికొలస్ ఒక్క పిల్లలకే కాక నావికులకికూడా పాట్రన్ సెయింట్. సముద్రంలో తుపానులో చిక్కుకున్న ఎన్నో ఓడలని ఆయన కాపాడన్న నమ్మకంవల్ల ఆయన వారికి పాట్రన్ సెయింట్‌గా మారాడు. అలాగే దొంగలకి, వడ్డీ వ్యాపారస్థులకికూడా ఆయన పాట్రన్ సెయింట్.

క్రీ.శ. 1087లో ఇటలీలోని బారి ఓడరేవునించి ఇద్దరు క్రిస్టియన్ ప్రీస్టులు, 47మంది నావికులు ఓడలో మైరాకి వచ్చి, మెరుపుదాడి జరిపి సమాధిలోని సెయింట్ నికొలస్ ఎముకలని తీసుకుని, తిరిగి ఇటలీకి చేరుకున్నారు. అప్పటికి టర్కీలోని ముస్లిము మతం విస్తరించి ఉండడంతో వారీపనికి ఒడిగట్టారు. ఇటలీలో సెయింట్ నికొలస్‌కోసం ఒక చర్చిని నిర్మించి, అతని అవశేషాలని అందులో ఉంచారు. అయితే, వాళ్లు దాడి జరిపినప్పుడు తొందరలో కొన్ని ఎముకలని వదిలేశారు. అవిప్పుడు టర్కీలో ఓ మ్యూజియంలో భద్రపరిచారు. 1972లో ఇటలీనుంచి సెయింట్ నికొలస్ ఎముకలు కొన్ని న్యూయార్కులోని గ్రీకు ఆర్థడాక్స్ చర్చికి చేరుకున్నాయి.

ఈవిధంగా సెయింట్ నికొలస్ ఎముక లిప్పుడు ఏసియాలో టర్కీలో, యూరప్‌లోని ఇటలీలో, అమెరికాలోని న్యూయార్కులో ఉన్నాయి.

1955లో టర్కీ సెయింట్ నికొలస్ గౌరవార్థం మైరాలో ఆయన పనిచేసిన చర్చిబొమ్మతో ఒక తపాలాబిళ్లని విడుదల చేసింది. ప్రపంచంలోని అతి పురాతన చర్చిలలో ఇదొకటి.

డి. పద్మజ